పంటల బీమా పథకంలో చేరండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

నెల్లూరు రూరల్: జిల్లాలో పంటలను సాగు చేస్తున్న రైతులు బీమా పథకంలో చేరాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. పంటల బీమా పథకంపై కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా పథకాల్లో గుర్తించిన పంటలు.. రైతులకు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణాంశాల ఆధారంగా కలిగే పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారాన్ని చెల్లించనున్నారని వివరించారు. తక్కువ ప్రీమియాన్ని చెల్లించి ఎక్కువ బీమాను పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో వరి, మినుములు, శనగలు, పెసర, వేరుశనగ తదితర పంటలను సాగు చేస్తున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమీపంలోని సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, పోస్టాఫీస్లు, పీఏసీఎస్లలో ప్రీమియాన్ని చెల్లించొచ్చని చెప్పారు. అనంతరం పంటల బీమా కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఎల్డీఎం మణిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగుల నిరసన



నెల్లూరు(బారకాసు): రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల కార్మికులు విధులను బుధవారం బహిష్కరించారు. తొమ్మిదో డివిజన్లో పారిశుధ్య పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు పిలిచిన టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బారాషహీద్ దర్గా ప్రాంతం నుంచి భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయ ప్రధాన గేట్ వద్ద ధర్నాను చేపట్టారు. భారీగా మోహరించిన పోలీసులు.. కార్మికులను లోపలికి వెళ్లనీయకుండా గేట్ వద్దే అడ్డుకున్నారు. శిబిరం వద్దకొచ్చిన మేయర్ స్రవంతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నెల్లూరు నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, రూరల్ కార్యదర్శి పెంచలనరసయ్య మాట్లాడారు. కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు కార్మికుల పొట్టగొట్టడం తగదని హితవు పలికారు. సీఐటీయూ నెల్లూరు నగర కార్యదర్శి నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, నేతలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, సుధాకర్, కోటేశ్వరరావు, మాలకొండయ్య, డీవైఎఫ్ఐ నెల్లూరు నగర కార్యదర్శి నరసింహ, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ, మట్టిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు ప్రాధాన్యమిస్తూ పదవులు కల్పిస్తామని పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో 19వ డివిజన్ నేతలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థాగత నిర్మాణ దిశగా అన్ని కమిటీలను ఏర్పాటు చేస్తూ.. రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా కృషి చేస్తామని వివరించారు. పార్టీ నగరాధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, జిల్లా మహిళాధ్యక్షురాలు లక్ష్మీసునంద, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, శ్యామ్‌సింగ్, కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, నవీన్‌కుమార్‌రెడ్డి, జాషువా, మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్



సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల హాజరును పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో ఫాగింగ్‌ను వారంలో ఐదు రోజుల పాటు జరపాలని కోరారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి ప్రత్యామ్నాయంగా జౌళి, వస్త్ర సంచులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఎంహెచ్‌ఓ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, సూపరింటెండెంట్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

⇨ విధి నిర్వహణలో భూగర్భ డ్రైనేజీ కార్మికులు రక్షణ ఉపకరణాలను తప్పక వినియోగించాలని కమిషనర్ నందన్ సూచించారు. జాతీయ 'నమస్తే' దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ పరిధిలోని భూగర్భ డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కార్మికులకు ఆయుష్మాన్‌భవ కార్డులు, ప్రోత్సాహక సర్టిఫికెట్లను అందజేసి వారిని సత్కరించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ అనిల్, ఏఈ నరేంద్ర, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

⇨ నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పని చేస్తూ కొండమ్మ మరణించడంతో ఆమె కుమారుడు కొండలరావుకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించారు. జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. కార్పొరేషన్ మేనేజర్ రాజేశ్వరి, రహీం తదితరులు పాల్గొన్నారు.

⇨ నగరంలోని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు అడ్డంకిగా ఎలాంటి శాశ్వత నిర్మాణాలను చేపట్టొద్దని కమిషనర్ నందన్ సూచించారు. ఆరో డివిజన్లోని శెట్టిగుంట రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం స్థానిక చేపల మార్కెట్ ప్రాంగణాన్ని తనిఖీ చేశారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు

నెల్లూరు(బృందావనం): అక్కచెరువుపాడులోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు అడ్మిషన్లను ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండానే నిర్వహిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి హైఫా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 87126 25045 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భూసేకరణకు వ్యతిరేకంగా రాష్ట్రపతికి పోస్టుకార్డులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కరేడు భూసేకరణకు వ్యతిరేకంగా పోస్టుకార్డుల ద్వారా రాష్ట్రపతికి తెలియజేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో నిరసన దీక్షను రెండో రోజు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జనరల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ మాట్లాడారు. కరేడులో భూసేకరణను వెంటనే విరమించాలని డిమాండ్ చేశారు. నేతలు నరేష్, మల్లికార్జునరెడ్డి, సుధీర్, ఇర్ఫాన్, సుధాకర్‌రెడ్డి, హనీఫ్, ధనుంజయ, సుజాత, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం): తగిన సమయంలో మందులు, పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా క్షయను జయించొచ్చని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 25 మంది వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ టైటస్ నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఏడీ ఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల తీరుతో సంక్షోభంలో వ్యవసాయం



మాట్లాడుతున్న హరిబాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడిందని కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి హరిబాబు ఆరోపించారు. కౌలు రైతుల సమస్యలు – పరిష్కార మార్గాలు అనే అంశంపై నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సెమినార్‌ను కౌలు రైతు సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కౌలు రైతు సంఘ పతాకాన్ని రైతు సంఘ సీనియర్ నేత చంద్రమౌళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగానికి నాలుగు శాతం నిధులను సైతం కేటాయించకపోవడం దారుణమన్నారు. కరేడు రైతుల నుంచి ఎనిమిది వేల ఎకరాలను లాక్కొని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు భూసేకరణ చట్టాన్ని తీసుకురావడం దారుణమన్నారు. విత్తనాల కొనుగోలు మొదలుకొని పంటను విక్రయించేంత వరకు అన్నదాతకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. విత్తనాలు, పురుగు మందులను కల్తీ చేస్తున్నారని చెప్పారు. పంటకు గిట్టుబాటు ధర లేక కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన రైతు కుటుంబాలకు రూ.లక్ష ఇచ్చి.. కౌలు రైతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి, ప్రస్తుతం దాన్ని విస్మరించారని ఆరోపించారు. కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ముత్యాల గుర్నాథం, రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, నేతలు బాబూరావు, చంద్ర రాజగోపాల్, వెంగయ్య, వెంకమరాజు, గోపాల్, విమల తదితరులు పాల్గొన్నారు.



హాజరైన రైతు సంఘాల నేతలు

క్లుప్తంగా

పోలీసుల పెట్రోలింగ్



నెల్లూరు సిటీ: వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్‌ను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వెంగళరావునగర్‌లోని ఏ, బీ బ్లాక్‌లలో పర్యటించారు.

పోస్టల్ సేవలకు 21న అంతరాయం

నెల్లూరు రూరల్: మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో పోస్టల్ సేవలను డిజిటలైజ్ చేస్తున్నామని, ఈ క్రమంలో పోస్టల్ సేవలకు ఈ నెల 21న అంతరాయం ఏర్పడనుందని తపాలా శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు.

వృత్తి పన్ను రద్దుకు వినతి



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

నెల్లూరు సిటీ: వృత్తి పన్నును రద్దు చేసే అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎల్ఐసీ ఏజెంట్లు కోరారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి నగరంలోని ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

కందమూరు – ఉప్పుటూరు మధ్య ప్రధాన రహదారి పనులకు శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్ డే రేపు

నెల్లూరు రూరల్: ఉద్యోగుల ఫిర్యాదులను పరిశీలించేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు గానూ గ్రీవెన్స్ డేను శుక్రవారం నిర్వహించనున్నామని డీఆర్వో హుస్సేన్ సాహెబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కార్యాలయాల్లో మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు వరకు కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటర్ల జాబితాను సరి చేయండి

తోటపల్లిగూడూరు: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను సరి చేయాలని తహసీల్దార్ పద్మావతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో నూతనంగా మార్పులు, చేర్పులు, సవరణల ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ విషయంలో బీఎల్వోలు తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్ల సూచనలు దృష్టిలో పెట్టుకుని పేర్ల మార్పులు, చేర్పులు, సవరణలను చేపట్టాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన అందరికీ నూతనంగా ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల గణాంకాధికారి రామ్‌ప్రసాద్, డీటీ శివయ్య, ఆర్ఐ యశ్వంత్, 50 మంది బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం 41 మంది బూత్ లెవల్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చామని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం) ఆదేశాల మేరకు బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. ఎన్నికల విధులు, నిర్వహణ తదితర అంశాలపై పలువురు అధికారులు అడిగిన సందేహాలను నివృత్తి చేశామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

కోవూరు: ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం మండలంలో పనిచేస్తున్న కూలీల సంఖ్య 612 నుంచి వెయ్యికి పెంచేలా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఎఫ్ఏలతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఉపాధి కూలీలకు ప్రభుత్వం రూ.307 చొప్పున వేతనాన్ని అందజేస్తోందన్నారు. కూలీల హాజరును ప్రతిరోజూ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. పనుల్లో పారదర్శకత, నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ప్రయోజనాలు కూలీలకు పూర్తిగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.